క్లుప్తంగా

ఆర్టీసీ డిపోల ముందు కార్మికుల నిరసన



హిందూపురం: ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హిందూపురం/పెనుకొండ/మడకశిర: హిందూపురం, పెనుకొండ, మడకశిర పట్టణాల్లోని ఆర్టీసీ డిపోల ఎదుట శుక్రవారం ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. నెల నెలా జీతాలతో పాటు ఇతర అలవెన్స్‌లను కలిపి ఇవ్వాలని, ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. అలాగే కార్మికులకు రావాల్సిన అన్ని రకాల అరియర్స్, సిక్ లీవ్ జీతాలు, విశ్రాంత కార్మికుల బకాయిలు తదితర వాటిని ట్రెజరీ అధికారులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా చెల్లించేలా చూడాలన్నారు. హిందూపురం డిపోలో ఎక్కువ కలెక్షన్లు వస్తున్న సర్వీసులను రద్దుచేయడం సరికాదన్నారు. కార్యక్రమాల్లో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వలిసాబ్, ఎన్ఎంయూ కార్యదర్శి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి జయసింహ తదతరులు పాల్గొన్నారు.

జపానందకు అరుదైన పురస్కారం



పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆస్పత్రి నిర్వాహకుడు జపానంద స్వామిజీ 'శ్రేష్ఠ సమాజ సుధారక' ప్రశస్తిని అందుకున్నారు. ఇటీవల చెన్నై మహా నగరంలో నోబెల్ బహుమతి గ్రహీత మదర్‌థెరిస్సా జాతీయ సంస్థ జపానందకు ప్రశస్తి అందించింది. గత 40 సంవత్సరాల నుంచి పావగడ ప్రజలకు అందించిన ఆరోగ్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవలను గుర్తించి ఆయనకు అవార్డు అందించారు. జపానందకు అవార్డు దక్కడంపై ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

2న వైఎస్సార్ వర్ధంతి

రొళ్ల: మండల కేంద్రంలో సెప్టెంబర్ 2న (సోమవారం) ఉదయం 11 గంటలకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న పది పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

జ్వరాలపై అవగాహన



డ్రైడేపై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని శాసనకోటలో ప్రాణాంతక జ్వరాలైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌పై పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వరూపరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డ్రైనేజీలను పరిశీలించి, అందులోని మురుగు నీటి వ్యర్థాలను తొలగించేందుకు చర్యలను చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు తెలిపారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, సీహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే



మాట్లాడుతున్న ఎస్ఐ జనార్దననాయుడు

అమరాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టం ముందు సమానమేనని ఎస్ఐ.జనార్దననాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉదుగూరులోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ.రామంజనేయులు, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయండి

మడకశిరరూరల్: మండలంలో కురిసిన వర్షాలు ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉందని, వెంటనే ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. సీజన్‌లో సకాలంలో వర్షం రాక వేరుశనగ పంట సాగు చేయని భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా విత్తనాలు పంపిణీ చేస్తే పంటలను సాగు చేసుకుంటామని చెబుతున్నారు.

పేరు ఘనం..అభివృద్ధి శూన్యం

- లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో మౌలిక వసతులు కరువు
- తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు లేక అవస్థలు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పర్యాటకులు



లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం



ఇనుప కడ్డీలకే పరిమితమైన మినరల్ వాటర్ ప్లాంట్

లేపాక్షి: దేశంలోనే లేపాక్షికి పర్యాటక కేంద్రంగా ఎంతో గుర్తింపు ఉంది. ప్రపంచ వారసత్వ కట్టడాల గుర్తింపు ప్రక్రియకు తాత్కాలిక జాబితాలో కూడా స్థానం దక్కింది. ఇంతటి ఖ్యాతిగాంచిన లేపాక్షిలో అభివృద్ధి మాత్రం కనిపించడం లేదు.

సౌకర్యాలు కల్పించరేం?

వీరభద్రస్వామి దేవాలయానికి రోజూ 500 మంది పర్యాటకులకుపైగా వస్తుంటారు. ఇక.. శని, ఆదివారాల్లో వేల సంఖ్యలో విచ్చేస్తుంటారు. ఎంతో చరిత్ర ఉన్న లేపాక్షిలో పర్యాటకులు కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ఎంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఆలయం వద్ద తాగునీటి సౌకర్యం లేదు. గతంలో ఆలయ ఆవరణంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉండేది. ప్రస్తుతం ఆ మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా తొలగించారు. దీంతో ఆలయానికి వచ్చే యాత్రికులు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త మినరల్ ప్లాంట్ ఏర్పాటు కోసం మిషన్లు సిద్ధంగా ఉన్నప్పటికీ కేవలం ఇనుప కడ్డీలకే పరిమితమైంది. అలాగే జటాయువు, థీంపార్కు వద్ద పర్యాటకుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ముఖ్యంగా వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించడానికి అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు విచ్చేస్తుంటారు. పర్యాటకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి బస్టాండ్ ప్రాంతంలో గాని, పార్కింగ్ స్థలం వద్ద గాని మరుగుదొడ్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అవి ఏపాటికీ సరిపోవడం లేదని వాపోతున్నారు. దేవాలయానికి విచ్చేసే యాత్రికుల కోసం కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు.

మహిళలు ఇబ్బందులు పడుతున్నారు



లేపాక్షి ఆలయానికి వచ్చే పర్యాటకులకు మరుగుదొడ్లు లేక అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా మహిళల బాధ వర్ణణాతీతం. పర్యాటకులు వాహనాలు పార్కింగ్ చోసే స్థలంలో పార్కింగ్ చేశాక మరుగుదొడ్ల కోసం వెతికితే ఎక్కడా కనిపించవు. ఉన్న మరుగుదొడ్లను సరిగ్గా మెయిన్‌టెయిన్ చేయడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. పర్యాటకుల కోసం పార్కింగ్ స్థలం లేదా బస్టాండు ఆవరణంలో మరుగుదొడ్లు నిర్మించాలి. ఎంతో పేరున్న లేపాక్షిలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– మల్లేశ్వరి, విశాఖపట్నం

కనీస సౌకర్యాలు కరువు



పర్యాటక రంగంగా ప్రసిద్ధి చెందిన లేపాక్షిలో పర్యాటకులకు అనుగుణంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. ఆలయ సమీపంలో తాగునీరు, మరుగుదొడ్లు, వసతులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాము. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించిన లేపాక్షి అభివృద్ధికి నోచుకోకపోవడం దురదృష్టకరం.

– బేహారా, విశాఖపట్నం

మహిళలపై దాడులను అరికట్టాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: రాష్ట్రంలో మహిళల హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందన్నారు. కోల్‌కత్తా వంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే మహిళలకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాతామన్నారు.

పెనుకొండ ఎస్ఐగా వెంకటేశ్వర్లు

పెనుకొండ: పట్టణ నూతన ఎస్ఐగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆయన పెనుకొండ ఎస్ఐగా పని చేస్తూ పంచాయతీ ఎన్నికల అనంతరం బదిలీపై వెళ్లారు. తాజా మళ్లీ ఆయన నేడు పెనుకొండ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా శంకరప్ప

పావగడ: తాలూకాలోని వెంకటాపురం వీఎస్ఎస్ఎన్ సంఘం అధ్యక్షుడిగా శంకరప్ప ఎన్నికయ్యారు. నలుగురు కాంగ్రెస్ డైరెక్టర్లు, ఇద్దరు జేడీఎస్ డైరెక్టర్లు, ఒక అఫీషియల్ ఓటు, తన ఓటుతో ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం జేడీఎస్‌కు గుడ్ బై చెప్పి తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్ పార్టీలోకి మాజీ మంత్రి వెంకటరమణప్ప సమక్షంలో చేరిపోయాడు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. యూపీఎస్‌ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ధర్నాలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, మాలింగప్ప, జోగప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో...

పెనుకొండ: పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలంటూ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దాకా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నారాయణస్వామి, రమేష్, ఉపేంద్ర, రవీంద్రనాథ్, కృష్ణా నాయక్, రామాంజినేయులు, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు చేయండి

మండలస్థాయిలో జరిగిన సర్దుబాటులో ఉన్నత పాఠశాలలకు ఎస్‌జీ టీచర్ల స్థానంలో డివిజన్‌లోని స్కూల్ అసిస్టెంట్‌లను సర్దుబాటు చేయాలని డీవైఈఓ రంగస్వామికి ఏపీటీఎఫ్ నాయకులు విన్నవించారు. స్థానిక డీవైఈఓ కార్యాలయంలో డీవైఈఓని కలిసి వినతిపత్రమిచ్చారు.

'పురం'లో సినిమా షూటింగ్



కార్యక్రమంలో పాల్గొన్న నటీనటులు

హిందూపురం టౌన్: పట్టణంలోని సప్తగిరి కళాశాలలో శుక్రవారం సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూపురానికి చెందిన నటుడు చన్ను తన సొంత బ్యానర్‌లో కథ, కథనం, దర్శకత్వం, నిర్మాతగా వ్యవహరించడంతో పాటు హీరో నటిస్తున్నాడు. స్వప్నమైండ్స్ సమర్పణలో వాయినందన స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్న సినిమా పూజా కార్యక్రమంలో హీరో చన్ను, హీరోయిన్ ప్రతిభ, అఖిల, వైష్ణవి, దుర్గ, కేశవ్, లవ్లీ, మంజు, మేనేజర్ అరవింద్, టెక్నీషియన్లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, సప్తగిరి కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. హిందూపురం నుంచి యువకులు చిత్ర పరిశ్రమలోకి ప్రవేశిస్తూ సినిమా నిర్మించడం ఎంతో హర్షణీయమన్నారు. సినిమా విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. హీరో చన్ను మాట్లాడుతూ స్థానిక కళాకారులు, యువతతో పురం చుట్టు పక్కల ప్రాంతాలలో షూటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కొన్ని సన్నివేశాలు తాను చదివిన సప్తగిరి కళాశాలలో చిత్రీకరిస్తున్నామని తెలిపారు. ఇది సందేశాత్మకంగా చిత్రం ఉంటుందన్నారు.

రెసిడెన్షియల్ భవనం పరిశీలన

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం పంచాయతీ కొండంపల్లిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ భవనాన్ని మంత్రి సవిత పరిశీలించారు. ఈ భవనాన్ని సెప్టెంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

- నిర్వాహకులు సహకరించాలన్న డీఎస్పీ మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్



హాజరైన ఉత్సవ కమిటీ నిర్వాహకులు

హిందూపురం అర్బన్: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు పూర్తయ్యేలా అందరూ సహకరించాలని హిందూపురం సబ్‌డివిజన్ డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్ఎంఎస్ కల్యాణ మంటపంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ పట్టణంలోని 38 వార్డుల్లో 200 విగ్రహాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. మండపాలు ఏర్పాటు చేసేవారు దరఖాస్తు చేసుకుంటే ఆయా స్టేషన్‌ల పరిధిలోని అధికారులు అనుమతులు ఇస్తారన్నారు. ముద్దిరెడ్డిపల్లి, శివారు ప్రాంతాల్లో మూడోరోజు 20 శాతం విగ్రహాలు నిమజ్జనానికి తరలుతాయని, 7వ రోజు 160 విగ్రహాలను నిమజ్జనం చేస్తారని పేర్కొన్నారు. నిమజ్జనం రోజు ఉదయమే విగ్రహాలను కదిలించి సాయంత్రం లోగా నిమజ్జనోత్సవం పూర్తయ్యేలా సహకరించాలని సూచించారు. రోడ్డుపైకి భారీ విగ్రహాలు తీసుకొచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ రోడ్లలో వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు 24 గంటలూ వంతుల వారిగానైనా సరే ఒకరిద్దరు ఉండేలా చూసుకోవాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైతే భక్తిభావంతో సకాలంలో విగ్రహాలను నిమజ్జనం చేస్తారో అలాంటి నిర్వాహకులకు ప్రత్యేకంగా బహుమతులు ఇస్తామన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఈఈ భూపతి, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్‌కరీం, జనార్దన్, డిప్యూటీ తహసీల్దార్ హారిక, ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు, ఉత్సవ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, పెనుకొండ పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీన జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఖయ్యూం నేతృత్వంలో ఈ జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ చదివిన వారు హాజరుకావచ్చన్నారు.

ఘనంగా 20వ వార్షికోత్సవం

లేపాక్షి: మండల కేంద్రంలోని నందీశ్వర మండల సమాఖ్య పరస్పర సహాయ సహకార పొదుపు సంఘాల లిమిటెడ్ 20వ వార్షిక వేడుకను సభ్యులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం కొత్తపాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అరుణమ్మ, ఉపాధ్యక్షురాలిగా గంగరత్నమ్మ, కార్యదర్శి రాధమ్మ, జాయింట్ సెక్రెటరీగా నారాయణమ్మ, కోశాధికారిగా దేవితో పాటు ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏసీ రామిరెడ్డి, ఏపీఎం జయచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వరమహాలక్ష్మిగా గంగమ్మ



హిందూపురం: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో అమ్మవారు వరమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అమరాపురం: గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుతీ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బంది సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు, రైతులు, విద్యార్థులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సోమందేపల్లి : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం సాయంత్రం మండ్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కడైనా కుల వివక్షత, పౌరహక్కులకు భంగం కల్గితే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



పెనుకొండ: మొక్క నాటుతున్న మంత్రి సవిత, కలెక్టర్ చేతన్



గుడిబండ: మొక్క నాటుతున్న సీడీపీఓ పద్మావతి



లేపాక్షి: మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

రొద్దం: ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు పెంచాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. శుక్రవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. రొద్దం గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూప మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా సీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు.వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈ మురళీ, పావగడ జపానందస్వామి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు పార్వతమ్మ, ఉమాశంకర్, బలరామ్, నరసింహరాజు పాల్గొన్నారు.

అమరాపురం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు.

రొళ్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకాన్ని చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని గురుకుల పాఠశాల చైర్మన్ సుమ, ప్రిన్సిపాల్ మైలారప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ షఫీవుల్లా, ప్రిన్సిపాల్ సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ మహేష్ హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామాంజినేయులు, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే వాతావరణ సమతుల్యత

పెనుకొండ: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడుదామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖామంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద వన మహోత్సవంలో భాగంగా మంత్రి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమన్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజుల సందర్భంగా మొక్కలు నాటాలని సూచించారు. పులేకమ్మ అటవీ ప్రాంతంలో రూ. 2 కోట్లతో 5 హెక్టార్ల విస్తీర్ణంలో యోగా సెంటర్, బాత్రూమ్‌లు, చిల్డ్రన్ ఏరియా, ఓపెన్‌జిమ్, వాకింగ్ పాత్, ఇంటర్నల్‌రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కుటుంబ సమేతంగా ఈ పార్కులో అందరూ సరదాగా గడపవచ్చన్నారు. అనంతరం మంత్రి పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

25 లక్షలు మొక్కలు నాటుతాం : కలెక్టర్

కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో 25 లక్షల మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నవంబర్ వరకూ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, యూనవర్సిటీలు, ఐఐటీలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, సబ్‌డీఎఫ్ఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.